క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు




రాయచోటి టౌన్/రైల్వేకోడూరు అర్బన్ : క్రమ శిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్అని వైఎస్సార్‌సీపీ నేతలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. సోమవారం రంజాన్ సందర్భంగా ముస్లిం, మైనార్టీలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసం మొత్తం ఎంతో కఠోర ఉపవాస దీక్షలు చేసి ఆకలి దప్పులతో పేదవాడి ఆకలి బాధలను తెలుసుకోవడం ఇస్లాం ఉద్దేశమని తెలిపారు. దుష్ట చింతల్ని, దురాగతాన్ని కుహాన సంస్కారాన్ని ఎదుర్కొని సత్ప్రవర్తనను నమాజ్ నేర్పుతుందన్నారు. అంతే కాదు ఈ మాసంలోనే పవిత్రమైన ఖురాన్ గ్రంథం ఆవిష్కరింపబడిందన్నారు. అందుకే రంజాన్‌కు పవిత్రత, గొప్పదనం, వచ్చాయని చెప్పారు. ప్రజందరికీ సకల శుభాలను సమృద్ధిగా లభించాలని మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక మన్నూరులో ఉగాదిని పురస్కరించుకొని ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కటారు (డీలర్) సుబ్బరామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం సురేఖ, శివరామకృష్ణ దంపతులు సుబ్బరామిరెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు పోకల ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డే రమణ, పఠాన్ మసూద్ అలీఖాన్, మిరియాల శంకర, కటారు నరసింహరెడ్డి, బోనం పిచ్చయ్య, తుమ్మలూరు రాజేష్, నక్కల రామసుబ్బయ్య, ఒంటికొమ్ము సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని పెద్ద బలిజపల్లె గ్రామంలో వెలసిన ఇష్టకామేశ్వరి సమేత సిద్దేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం గ్రామ ప్రజలు సత్యనారాయణ వ్రత పూజలను నిర్వహించారు. ఉగాది సందర్భంగా ఉదయాన్నే సిద్దేశ్వర స్వామి, కూటాలమ్మ దేవాలయాలలో స్వాముల వారిని వేదపండితులు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు చేసి పూజలు జరిపారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని వేదపండితులు భక్తుల చేత చేయించారు.

ఉపాధ్యాయుల కష్టాలు తొలిగి సంతోషంగా ఉండాలి



డీఈఓ సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న ఆపస్ నాయకులు

రాయచోటి టౌన్ : కష్టసుఖాల మేలు కలయికే ఉగాది అని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా రాయచోటి బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఉగాది ఉత్సవ వేడుకల నిర్వహణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ విశ్వావసు నామ సంవత్సరంలో అందరి కష్టాలు తీరి సుఖ సౌఖ్యాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు సవర్ణగారి బాలాజీ మాట్లాడుతూ ఈ ఏడాది ఉపాధ్యాయుల కష్టాలు తొలిగి వారి కుటుంబ సభ్యులందరూ సంతోషంగా ఉండాలన్నారు. అనంతరం డీఈఓ సుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయునికి సన్మానం



నందలూరు : రాయచోటిలో ఆదివారం నిర్వహించిన ఉగాది సంబరాలలో భాగంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో నందలూరుకు చెందిన కవి, గణిత ఉపాధ్యాయుడు అల్లం అశోక్ కుమార్‌ను అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడులు శాలువా, పూలమాల, మెమెంటోతో సన్మానించారు. ఈయన ప్రస్తుతం పెనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు.

తొలి పండుగ.. మది మురియగ

- ఉగాది వేడుకలతో కళకళలాడిన లోగిళ్లు
- పలుచోట్ల పంచాంగ పఠనాలు



రైల్వేకోడూరు అర్బన్: సత్యమ్మ గుడిలో పూజలు చేస్తున్న భక్తులు



సంబేపల్లె: అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

రాజంపేట టౌన్ : తెలుగువారి తొలి పండుగ ఉగాదిని నియోజకవర్గంలోని ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా ఉగాది వేడుకల సందడి స్పష్టంగా కనిపించింది. హిందువులు తమ ఇళ్లను మామిడి మండలు, అరటి పిలకలతో శోభాయమానంగా అలంకరించుకున్నారు. వేకువ జామునే స్నానమాచరించి షడ్రుచులతో తయారు చేసుకున్న ఉగాది పచ్చడిని రుచి చూశారు. అనేక మంది తమ ఇళ్లల్లో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయాలకు వెళ్లి ఇష్ట దైవాలను దర్శించుకొని ఏడాదంతా మంచి జరిగేలా చూడు స్వామి అంటూ వరపడ్డారు. దీంతో ప్రధాన ఆలయాలన్ని భక్తులతో కిక్కిరిశాయి. ఇదిలావుంటే పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి వినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉభయదాత చిట్వేలి రవికుమార్, సుజాత దంపతులు భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. కాగా పలు ప్రాంతాల్లో పంచాంగ పఠనం నిర్వహించారు.

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు మండలంలో పలు ప్రాంతాలలో ప్రజలు భక్తిశ్రద్ధలతో విశ్వవసు నామ సంవత్సరానికి వైభవంగా ఆదివారం స్వాగతం పలికారు. పాత బజారులోని కోదండ రామాలయం, వేంకటేశ్వరస్వామి, కన్యకా పరమేశ్వరి దేవస్థానం, భుజంగేశ్వరాలయాలలో ఉగాది వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. అన్ని ఆలయాలలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి షడ్రుచుల ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకల్లో అందరూ బాగస్వాములు కావాలని జనవరి ఫస్ట్ వద్దు ఉగాదే ముద్దు అని తెలుగు ప్రజలు తెలుసుకోవాలన్నారు.

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారికి ఉగాది పండుగను పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రంగమ్మ అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, అమ్మవారికి కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను జరిపారు. అనంతరం వచ్చిన భక్తులు అమ్మవారి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి కాయా కర్పూరాలను సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ప్రారంభమైన శ్రీరామనవమి ఉత్సవాలు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేటలో వెలసిన శ్రీ కోదండరామాలయంలో తెలుగు సంవత్సరాది ఉగాది మొదలు ఆదివారం శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్ ధ్వజ నవగ్రహ, మహాగణపతి దేవులకు భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌లు, ఉత్సవ మూర్తులకు షోడశోపచార పూజలు, పంచామృత అభిషేకాలు, పట్టు వస్త్రాలంకరణ, పూలమాలలు ఉగాది పచ్చడి ప్రసార నివేదన, మహా మంగళహారతి అర్చకులు నిర్వహించారు. ఏప్రిల్ 6వ తేదీ వరకు రోజు ఉభయదాతలు పూజలతో సీతారామ కల్యాణం, రాత్రి గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆర్యవైశ్య సంఘం, ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా ఉగాది వేడుకలు

మండలంలో నూతన తెలుగు సంవత్సరాది విశ్వవసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని అన్ని గ్రామాలలోని ఆలయాలలో ప్రజలు ఉదయం నుంచే ఘనంగా సాంప్రదాయ దుస్తులు ధరించి పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడి తీర్థ ప్రసాదాలతో పాటు భక్తులకు అందజేశారు. కంభ రాయుడి గుట్టపై వెలసిన శ్రీ మహావిష్ణు ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నల్లగంగమ్మ ఆలయంలో భక్తుల సందడి



రాజంపేట టౌన్: అలంకరణలో వరసిద్ధి వినాయక స్వామి

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు గావించారు. ఆలయంలోని బీజాక్షరాలతో ఉన్న మహిమగల రాయిపై భక్తులు పొర్లుదండాలు పెట్టారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



సిద్దవటం: శీతల గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



రామాపురం: ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్‌లు



రైల్వేకోడూరు అర్బన్: రాములోరి గ్రామోత్సవం



రైల్వేకోడూరు అర్బన్: అలంకారంలో భుజంగేశ్వరుడు

అంకాలమ్మకు విశేష పూజలు



పొంగళ్లు వండుతున్న మహిళలు

రాజంపేట టౌన్ : మండలంలోని తుమ్మల అగ్రహారం గ్రామంలో వెలసిన అంకాలమ్మకు ఆ గ్రామ మహిళలు ఆదివారం రాత్రి పెద్దఎత్తున పొంగళ్లు పెట్టి విశేషంగా పూజలు నిర్వహించారు. బలిజపల్లె గంగమ్మకు తుమ్మల అగ్రహారం పుట్టినిల్లు. అందువల్ల బలిజపల్లెలో జాతరకు అంకురార్పణ చేసే సమయంలో గంగమ్మకు సోదరిణి అయిన అంకాలమ్మకు పొంగళ్లు పెట్టడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. అందులో భాగంగా మహిళలు అంకాలమ్మకు ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా అంకాలమ్మా మము కాపాడమ్మా అంటూ వేడుకున్నారు. ఈ ఏడాది సంవృద్ధిగా వర్షాలు కురిపించి ప్రజలందరికి సుఖసంతోషాలు, సిరి సంపదలు ఇవ్వుతల్లి అంటూ వరపడ్డారు. మహిళలు పెద్దఎత్తున తరలిరావడంతో ఆ గ్రామంలో ఎటుచూసినా సందడి వాతావరణం కనిపించింది. తొలుత గ్రామంలో స్వయంభుగా వెలసిన గంగమ్మ తల్లికి విశేషంగా పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టుకునేందుకు వీలుగా ఆ గ్రామ జాతర నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

నేడు జిల్లా కలెక్టర్ పర్యటన

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా సోమవారం టీటీడీ జేఈఓ వీరబ్రహ్మంతో కలిసి కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పర్యటించనున్నట్లు డివిజనల్ పీఆర్‌ఓ మస్తాన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై టీటీడీ సమావేశ భవనంలో జిల్లా, టీటీడీ యంత్రాంగంతో చర్చించనున్నారు.

రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ దీపాలంకరణలో జామియా మసీదు



ఈద్గా మైదానం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులో భక్తి శ్రద్ధలతో నేడు జరిగే రంజాన్ ప్రార్థనలకు నూతనంగా నిర్మించిన జామియా మసీదు, మైసూరావారిపల్లి పంచాయతీలోని నూతన ఈద్గా మైదానం ముస్తాబయ్యాయి. ఏర్పాట్లను ఆదివారం జామియా మసీద్ కమిటీ సభ్యులు కో-ఆప్షన్ జెడ్పీటీసీ అన్వర్‌బాషా, పఠాన్ మౌలా, కరీముల్లాలు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం (నేడు) ఉదయం 8:30 గంటలకు రంజాన్ పవిత్ర దినాన ముస్లింలు ప్రార్థనలు చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముజీబ్, షబ్బీర్, సాదక్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

రచయితకు సత్కారం



సత్కారం పొందిన గుండ్రాతి సుబ్రమణ్యంగౌడ్

రాజంపేట టౌన్ : ఉగాదిని పురస్కరించుకొని జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఆదివారం కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం కార్యక్రమంలో రాజంపేటకు చెందిన ప్రముఖ రచయిత గుండ్రాతి సుబ్రమణ్యంగౌడ్ సత్కారం పొందారు. ఈ విషయాన్ని ఆయన ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఇదిలావుంటే 1980వ సంవత్సరం నుంచి వివిధ పత్రికల్లో సుబ్రమణ్యంగౌడ్ కథలు దాదాపు 150కి పైగా ప్రచురితం అయ్యాయి. అలాగే ×సాక్షి×దినపత్రికలో, ఆదివారం అనుబంధంలో ఆయన కథలు ప్రచురితమయ్యాయి. చందమామ పుస్తకంలో 21 బేతాళ కథలు, పిల్లలకు సంబంధించిన బొమ్మరిల్లు మాసపత్రికలో నలబై కరాళ కథలు కూడా ప్రచురితం అయినట్లు సుబ్రమణ్యంగౌడ్ తెలిపారు.

ఏప్రిల్ 2న కలెక్టరేట్ వద్ద నిరసన



మాట్లాడుతున్న ఫ్యాప్టో నేతలు జాబీర్, గఫర్‌ఖాన్

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 2వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని జరుప తలపెట్టినట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్, సెక్రటరీలు షేక్ జాబీర్, గఫర్ ఖాన్‌లు తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో ఫ్యాప్టో జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరెండర్ లీవు బకాయిల కోసం 2022 జనవరి నుంచి దరఖాస్తు చేసుకున్న వేలాది మంది ఉపాధ్యాయులు వేచి చూస్తుండడం దారుణమన్నారు. చనిపోయిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టలేదన్నారు. స్థానిక సంస్థల నిర్వహణలోని పాఠశాలల్లో ఖాళీలు లేవనే అసంబద్ధమైన కారణంతో నియామకాలను నిలుపుదల చేయడం తగదన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలంటూ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడికి జిల్లాలోని ఉపాధ్యాయులంతా పెద్ద ఎత్తున హాజరుకావాలంటూ వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఫ్యాప్టో కో-చైర్మన్‌లు రవిశంకర్, శివారెడ్డి, రామక్రిష్ణ, డిప్యూటీ సెక్రటరీలు హరిబాబు, ఇలియాస్, కోశాధికారి జాఫరుద్దీన్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

నాయకుల ఇళ్ల వద్ద ఉగాది సందడి



రామాపురం: గడికోట మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

రామాపురం/రైల్వేకోడూరు అర్బన్ : విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డిలు ఆకాంక్షించారు. ఆదివారం రామాపురం మండలంలోని సుద్దమళ్ల గ్రామం యర్రమరెడ్డిగారిపల్లెలోని నివాసంలో ఉగాది పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి, దుశ్శాలువాలతో సత్కరించారు. రాయచోటి మండలం శిబ్యాల ఎంపీటీసీ బోరెడ్డి నాగసుబ్బమ్మ వైస్ ఎంపీపీగా ఎన్నికైన సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామ నాయకులు కలసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. అలానే ఉగాదిని పురస్కరించుకుని తిరుపతిలోని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నివాసంలో ఆయన్ను రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు ఎలగచర్ల శివప్రసాద్‌రెడ్డిలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు.



రైల్వేకోడూరు అర్బన్: ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

చల్లంగా చూడు గంగమ్మా



గంగమ్మను దర్శించుకొని గ్రామస్తులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : గంగమ్మ తల్లి ప్రజలందరినీ చల్లంగా చూడు తల్లి అంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రార్థించారు. ఆదివారం రాత్రి మండలంలోని రాచపల్లె గ్రామం బీదంవాండ్లపల్లెలో ఉగాది సందర్భంగా గంగమ్మకు గడ్డం రామాంజులురెడ్డి చాందినీ బండి కట్టిన సందర్భంగా అమ్మవారికి నిర్వహించిన పూజలలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులు ఆత్మీయ ఘనస్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహింపచేసి తీర్థప్రసాదాలు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి



టోల్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

రైల్వేకోడూరు అర్బన్ : పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని క్రైస్తవ సమాజం సభ్యులు కోరారు. ఆదివారం స్థానిక టోల్ గేట్ వద్ద పాస్టర్ ఇమ్మానుయేల్ బాబు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి పేరున్న పాస్టర్ ప్రవీణ్ మృతిపై చాలా అనుమానాలు ఉన్నాయన్నారు. క్రైస్తవ మనోభావాలు తెబ్బతీసినట్లు ఉందని తెలిపారు. నిష్పక్షపాతంగా నిజాలు నిగ్గుతేల్చి ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఘనంగా మంచాలమ్మ తిరునాల



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ మేడా

నందలూరు : మండలంలోని ఆడపూరు గ్రామంలో వెలసిన శ్రీ మంచాలమ్మ తిరుణాల ఆలయ ధర్మకర్త ఇంజం రామచంద్ర నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంచాలమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించారు. ఉదయం మహిళలు పెద్దఎత్తున పాల్గొని బోనాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. తిరునాలలో ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సిపి రాజంపేట ఇన్‌చార్జ్ ఆకేపాటి అనీల్ కుమార్ రెడ్డిలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో వారికి ఆలయ నిర్వహకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆదివారం రాత్రి గ్రామోత్సవానికి బయలుదేరి మంచాలమ్మ సోమవారం మధ్యాహ్నం ఆలయానికి చేరుకోనుంది.

వైభవంగా ఏకవీరమ్మ గ్రామోత్సవం



మండల కేంద్రంలో ఊరేగుతున్న ఏకవీరమ్మ

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని గ్రామ దేవత ఏకవీరమ్మ ఊరేగింపు గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే దేవత ఏకవీరమ్మను భక్తులు భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఉగాది పండుగ సందర్భంగా జిల్లేల మడగ, వడ్డిపల్లి గ్రామంలోని ఏకవీరమ్మ గుడి నుంచి ఉత్సవ విగ్రహాన్ని చాందినీ బండిపై ముస్తాబు చేసి మేళతాళాలతో గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తారు. మొదటి మండల కేంద్రంలోని గ్రామ పుర వీధులలో ఊరేగింపు నిర్వహిస్తారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి కాయా కర్పూరం సమర్పించి పూజలు నిర్వహించారు. ఉగాది పండుగ మొదలుకొని రెండు రోజులపాటు మండల కేంద్రంలోని ముదినేపల్లి, కటికంవారిపల్లి, శివశంకరాపురం, పున్నాటివారిపల్లి, జిల్లేల మడక, వడ్డిపల్లి, పుటికంవారిపల్లి, బొంతవారిపల్లి గ్రామాలలో ఊరేగింపు నిర్వహించి గుడికి చేరుకుంటుంది. సోమవారం జిల్లేల మడగ, వడ్డిపల్లి గ్రామంలో ఏకవీరమ్మ గుడిలో పెద్దఎత్తున జాతరను నిర్వహిస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించిన పూలతో అమ్మవారి మూలవిరాట్‌ను అలంకరించి పెద్దఎత్తున పొంగబాళ్లు సమర్పించి భక్తులు తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు.

ప్రార్థనలకు మసీదులు ముస్తాబు



పుల్లంపేట : నేడు (సోమవారం) పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా మండలంలోని పుల్లంపేట, దళవాయిపల్లి, అప్పారాజుపేట ఖాదర్‌పేట తదితర ప్రాంతాలలోని మసీదులు ముస్తాబయ్యాయి. ముస్లిం సోదరులు వేకువ జామునే తలంటి స్నానాలు ఆచరించి ఉదయం 7 గంటల నుంచి మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు మసీదు నిర్వాహకులు తెలియజేశారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనుల తనిఖీ



పనులను తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లి మండలంలో డీఎంఎఫ్ గ్రాంట్స్ ద్వారా చేపట్టిన ఆర్‌డబ్ల్యూస్ పనులను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కడప విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి కెసి జాకోబ్ పాల్, అసిస్టెంట్ ఇంజనీర్ జగదీష్, క్వాలిటీ కంట్రోల్ కిషోర్ కుమార్‌లు శని, ఆది వారాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో నిర్వహించిన పనులపై ఆరా తీసి గ్రామస్తులను పనుల నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్, ఆర్‌డబ్ల్యూఎస్ కిషోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఓగూరమ్మ కల్యాణం

పెనగలూరు : మండలంలోని ఈటమాపురం గ్రామం మామిడితోటలో ఉన్న పట్టపురాయి ఓగూరమ్మ కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజలు అనంతరం వేపచెట్టు, రాగిచెట్లకు కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణానికి గ్రామం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కల్యాణం మూడురోజులపాటు నిర్వహించనున్నట్లు ఈటమాపురం గ్రామ ప్రజలు తెలిపారు. సోమవారం పొంగళ్లు, రాత్రికి పూజలు, గ్రామంలో ఊరేగింపు జరుగుతుందని వారు తెలిపారు.



రావిచెట్టుకు, వేపచెట్టుకు కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు